సాక్షి
చిత్తూరు
గురువారం : 23 : నవంబర్ : 2023




సంక్షేమం..అభివృద్ధికి కేరాఫ్ ఏపీ

సంక్షేమం..అభివృద్ధికి కేరాఫ్ ఏపీ అని, అందుకు జగనన్నే కారణమని మంత్రి ఆర్కే రోజా అన్నారు. - 8లో



ఆయా కర్కశత్వం

అంగన్‌వాడీలో పనిచేసే ఓ ఆయా ఓ చిన్న పిల్లాడిపై కర్కశత్వంగా ప్రవర్తించింది. - 8లో



చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరులో కీర్తన గోల్డ్ ఫైనాన్స్‌లో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : నాలుగో విడత వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కార్యక్రమం ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

ఆ భూమి కాలువ పోరంబోకు!



ఆక్రమణ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: టీడీపీ నాయకులు ఆక్రమించుకున్న భూమి కాలువ పోరంబోకు అని తహసీల్దార్ మురళీమోహన్, డీటీ కిరణ్ స్పష్టం చేశారు. చిత్తూరు మండలం 36.గొల్లపల్లెలో టీడీపీ నాయకుల భూ ఆక్రమణలపై సాక్షి దినపత్రికలో బుధవారం 'అనుభవించు రాజా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ షణ్మోహన్ స్పందించారు. విచారించి వెంటనే చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈమేరకు తహసీల్దార్ మురళీమోహన్, డీటీ కిరణ్, వీఆర్వో హేమాద్రి, సర్వేయర్ కుమార్ అక్కడి చేరుకున్నారు. ఆక్రమిత భూ వివరాలపై ఆరా తీశారు. అది ప్రభుత్వ కాలువ పోరంబోకుగా గుర్తించారు. దీంతో ఆ భూమిలో నాటిన మామిడి మొక్కలను తొలగించారు. ఈ భూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తే కేసు పెడుతామని ఆక్రమణదారులను హెచ్చరించారు. కలెక్టర్‌కు అది కాలువ పోరంబోకు అని, నాటిన మామిడి మొక్కలను తొలగించామని, ఇకపై ఆక్రమణ గురికాకుండా చూస్తామని మండల అధికారులు నివేదికలు సమర్పించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,981 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,492 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.55 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఆగమోక్తంగా 'ఆకాశ దీపం'

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆగమోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా ముక్కంటి ఆలయంలో నిత్యం ఆకాశదీపం వెలిగించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆలయంలోని ఊంజల్ సేవ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

శ్రీసిటీ సందర్శించిన ఆర్టీసీ ఎండీ



సత్యవేడు: ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. సమీపంలోని పట్టణాలు, గ్రామాలను కలిపే ప్రజా రవాణా సదుపాయం లేకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. సత్యవేడు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తడ నుంచి శ్రీసిటీకి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పారిశ్రామిక హబ్‌లోని ప్రధాన నగరాలను కలుపుతూ జనరల్ షిఫ్ట్ వేళలకు అనువుగా సర్వీసులు ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్టీసీ ఎండీ స్పందించారు. ఈ విషయాలను పరిశీలించి తగు చర్యలు తీ సుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

జలసిరి..ఆనందలహరి

సకల జీవకోటికి నీరు ప్రాణాధారం..అది అమృతతుల్యం.. అలాంటి జలం కోసం పేదలు ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం. పేదలకు గూడు నిస్తే సరిపోదని.. అక్కడ వసతులు కల్పించాలని నిర్ణయించింది సర్కారు. అందుకే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ముందే తాత్కాలికంగా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇస్తోంది. కాలనీల్లో జలసిరి కలగడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- పేదల ఇళ్లకు కొళాయి
- తాత్కాలిక కనెక్షన్లు 7,170
- శాశ్వత కనెక్షన్ల లక్ష్యం 15,344
- 300 సింథటిక్స్ ట్యాంక్‌లు ఏర్పాటు
- నీటి సరఫరా కోసం రూ.21.82 కోట్ల ఖర్చు



పలమనేరులో లే అవుట్లలో తాగునీటి పైప్‌లైన్ పనులు



చిత్తూరు కార్పొరేషన్/చిత్తూరు అగ్రికల్చర్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. రోడ్లు, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీల నిర్మాణంతోపాటు ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం పక్కాగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టింది.

ఇంటి నిర్మాణానికి ముందే కొళాయి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టక ముందే ఇంటింటికీ కొళాయిల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో జగనన్న లే అవుట్లు 534 వరకు ఉన్నాయి. ఈ కాలనీల్లో గ్రామీణ నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో తాగునీరు అందించే పనులు వేగవంతం చేసింది. అన్ని లేఅవుట్లలోనూ ప్రతి ఇంటి వద్ద కొళాయి ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆర్‌డబ్ల్యూఎస్ శరవేగంగా పనులు చేస్తోంది. మొత్తం లే అవుట్లలో వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. పలు పనులకు సంబంధించి టెండర్లు ఖరారయ్యే దశలో ఉన్నాయి. జగనన్న కాలనీల్లో ఒకవైపు ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగానే మరోవైపు విద్యుత్ సర్వీసులు, తాగునీటి సరఫరా కోసం ప్రతి ఇంటి వద్ద కొళాయి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన భూగర్భ పైపులైన్‌ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. లబ్ధిదారుని ఇష్టం మేరకు ఇంటి బయట లేదా ఇంటి ఆవరణలో కొళాయి ఏర్పాటు చేస్తున్నారు. తొందరలోనే ఇళ్లు కట్టుకునేవారిని గుర్తించి, వారి అభ్యర్థన మేరకు ముందుగానే కొళాయి ఏర్పాటు చేస్తుండడం విశేషం.

7,170 కొళాయి కనెక్షన్లు

ప్రతి ఇంటికీ సంవృద్ధిగా తాగునీరు అందేలా పక్కాగా చర్యలు చేపట్టారు. గ్రామంలో, లేదా సమీప ప్రాంతంలో ఉన్న ట్యాంకుల నుంచి ఇక్కడకు పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. కాలనీలు ఊరికి దూరంగా ఉన్నా, లేకుంటే కాలనీల్లో 200 కన్నా అధికంగా ఇళ్లు ఉన్నా అక్కడే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు సైతం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం రూ.8.72 కోట్ల వ్యయంతో 237 ఓవర్ హెడ్ ట్యాంకుల పనుల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. వీటితోపాటు పైపులైన్, ఇతర 410 పనులకు సంబంధించి రూ.43.28 కోట్ల పనులకు టెండర్లను ఆహ్వానించారు. ఎక్కడైనా పనులు ఆలస్యమైన ఇళ్లు కట్టుకుంటున్న వారికి మాత్రం తాగునీరు అందించడమే ప్రాధాన్యంగా పనులు చేపడుతున్నారు.



గుడిపాల లే అవుట్‌లో నీరు పట్టుకుంటున్న వాసంతి

తాత్కాలికంగా 7,170 కొళాయి కనెక్షన్లు ఇవ్వగా శాశ్వత ప్రతిపాదికన 15,344 కనెక్షన్లు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలోని 534 లే అవుట్లు ఉండగా అందులో 295 లే అవుట్లలో బోర్లు వేసి మోటారు ఏర్పాటు చేసి, 214.29 కిలోమీటర్లు పైపులైన్ వేశారు. మొత్తం సింథటిక్ ట్యాంక్‌లు 300 పైగా ఏర్పాటు చేసి, వీటి ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. వీటికి రూ.21.82 కోట్లు ఖర్చు చేశారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వెంటనే తాగునీరు అందడం చాలా సంతోషంగా ఉందని కాలనీల్లో నివాసముంటున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని జగనన్న లే అవుట్లు :	534
లేఅవుట్లలో వేసిన బోర్లు :	433
పైపులైన్ల నిర్మాణం :	214.29 కిలోమీటర్లు
కొళాయిలు ఏర్పాటు చేసినవి :	295 లే అవుట్లు
ఖర్చు చేసిన మొత్తం :	రూ.21.82 కోట్లు
సింథటిక్ ట్యాంక్‌లు :	300
తాత్కాలిక కొళాయి కనెక్షన్లు :	7,170
శాశ్వత కొళాయి కనెక్షన్ల లక్ష్యం:	15,344

స్థలంతోపాటు నీటి సదుపాయం

"తాగునీటి కోసం మొదట్లో దూరం వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు ఇంటి సమీపంలో కొళాయి ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలో మాకు ఇంటి స్థలంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి అయితే ఎల్లప్పుడు నీరు వచ్చేలా శాశ్వతంగా కొళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు అధికారులు వివరించారు.

– వాసంతి, గుడిపాల

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షనే లక్ష్యం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణలు పూర్తయిన చోట్టే కాకుండా త్వరలో నిర్మించే ఇళ్ల వద్ద కూడా కొళాయిలను ఏర్పాటు చేస్తున్నాం. ఇంటి ఆవరణలో, లేదా ఇంటి అనుకుని బయట వీటిని నిర్మిస్తున్నాం . ఈ విషయంలో లబ్ధిదారుల ఇష్టం మేరకు నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రతి ఒకరికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. – విజయ్‌కుమార్, ఎస్‌ఈ జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ

చెడ్డీ గ్యాంగ్‌లపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు అర్బన్: తిరుపతిలో ఇటీవల వెలుగుచూసిన చెడ్డీ ముఠా సీసీ ఫుటేజీలపై చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు. బుధవారం ఆయన చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఊర్లకు వెళ్లేప్పుడు డయల్–100 ద్వారా పోలీసులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఊరికి వెళ్లిన ఇళ్లలో సీసీ కెమెరాలు పెట్టడం ద్వారా చోరీలు జరగకుండా నిరోధించడం సాధ్యమవుతుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో ఎక్కడైనా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇక రాత్రి గస్తీలు పెంచడం, పోలీసు పట్రోలింగ్ వాహనాలు 24 గంటలు తిరుగుతాయని తెలిపారు.

ఎన్నికల విధులకు ఉద్యోగుల వివరాల సేకరణ

చిత్తూరు కలెక్టరేట్ : త్వరలో నిర్వహించనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధులకు ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు వివరాలను పకడ్బందీగా సేకరించి, సంబంధిత ప్రొఫార్మాలో పంపాలని సూచించారు. ఈ నెల 23వ తేదీలోపు సంబంధిత శాఖల హెచ్‌ఓడీలు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, అదర్ పోలింగ్ ఆఫీసర్ (ఓపీఓ) వివరాలను పంపాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

అవగాహన కల్పించండి

చిత్తూరు రూరల్: ప్రభుత్వ శిశు ఆరోగ్య సేవలపై తల్లులకు అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆమె మండల వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా, శిశు సంరక్షణకు పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వాటన్నింటిని లబ్ధిదారులు వినియోగించేకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా చిన్నారుల సంరక్షణకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న శిశు వైద్య సేవలపై తల్లులకు అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎంల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు డీఆర్వో రాజశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈవీఎంల వినియోగంపై ప్రజలకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో డెమో వాహనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లా వ్యాప్తంగా కసరత్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లు తొలగించాలంటే సరైన ధ్రువీకరణ పత్రాలను కుటుంబ సభ్యులు అందజేయాల్సి ఉంటుందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో అందే క్లెయిమ్‌లను బీఎల్వోలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. పలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, గంగరాజు, సురేంద్రకుమార్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా పాల్గొన్నారు.

పెరుగుతున్న రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 విధానం ద్వారా రెండో రోజు రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగిందని బుధవారం జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. తొలిరోజు మంగళవారం, సర్వర్ సమస్యతో 47 రిజిస్ట్రేషన్లల జరిగిందన్నారు. కాగా రెండోరోజు 107 డ్యాకుమెంటేషన్లు అయ్యాయన్నారు. రైటర్లు వీటిపై అవగాహన పెంచుకుని, అసత్య ప్రచారాల గురించి వినియోగదారులకు తెలియజేయాలన్నారు.

క్లెయిమ్‌లు పరిశీలించి.. పరిష్కరించండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదైన క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కసరత్తుపై మండల ప్రత్యేకాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అక్టోబర్ 27వ తేదీన ప్రచురించిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం నమోదవుతున్న క్లెయిమ్‌లు పకడ్బందీగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు ప్రతి క్లెయిమ్‌ను పరిశీలించి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. డూప్లికేట్, జంక్, క్యారెక్టర్, ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఉన్న ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కసరత్తులో ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

24 నుంచి చౌడేపల్లెలో రాష్ట్రస్థాయి కబడ్డీ

- మూడు రోజులపాటు క్రీడా పోటీలు
- 13 జిల్లాలనుంచి 500 మంది క్రీడాకారుల రాక
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారుల బృందం



మైదానంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎంపీడీఓ సుధాకర్, రామచంద్ర

చౌడేపల్లె: అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీలను ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు రామచంద్ర తెలిపారు. బుధవారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న క్రీడా మైదానాన్ని ఎంపీడీఓ సుధాకర్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబుతోపాటు అధికారుల బృందం పరిశీలించింది. ఈ క్రీడా పోటీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు రానున్నారు. సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. అంతర్‌జిల్లాల నుంచే క్రీడా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజనం, బస కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు నిర్వహించేలా మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీప కాంతులు సైతం ఏర్పాటు చేశారు. కబడ్డీ క్రీడలను వీక్షించేందుకు వీలుగా బ్యారికేడ్‌లు ఏర్పాటు చేసి చుట్టూ ప్రేక్షకులు కూర్చొనేలా సౌకర్యం కల్పించారు. సర్పంచ్ వరుణ్ భరత్, ఉపాధ్యాయులు దేవదానం , మురళి, ఈశ్వర్, పీడీలు వెంకటేష్, నితిన్, రెడ్డెమ్మ, రాజేంద్ర, పూర్వపు విద్యార్థులు పిల్లారి జీవన్ ప్రకాష్, లీలాకుమార్, మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జలయోగ మస్తు

- నీటిలో ఐదు గంటలపాటు శవాసనం
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించిన వైసాక్



నీటిలో శవాసనం వేస్తున్న వైసాక్

చిత్తూరు కలెక్టరేట్ : నగరానికి చెందిన వైసాక్ అనే యువకుడు నీటిలో ఐదు గంటల పాటు శవాసనం చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో పోటీ నిర్వహించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అడ్వైజర్ హరీష్ మాట్లాడుతూ ఉదయం 8.53 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైసాక్ నీటిలో నిర్విరామంగా శవాసనం వేశారని చెప్పారు. ఇప్పటివరకు గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో మూడు గంటల వరకే ఇలాంటి ఆసనం నీటిలో వేశారన్నారు. ఆ రికార్డును ప్రస్తుతం అధిగమించి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించడం గొప్ప విషయమన్నారు. అనంతరం అడ్వైజర్ హరీష్ చేతుల మీదుగా ఇండియా బుక్ అవార్డును అందుకున్నారు. ఈ రికార్డును సాధించిన వైసాక్‌ను తల్లిదండ్రులు భవానీ బాబు, శోభ, చిత్తూరు నగర వాసులు అభినందించారు.

టీడీపీ పాపం.. మాపై రుద్దకండి

- పచ్చపత్రికలో వచ్చిన కథనంపై మంత్రి రోజా ఆగ్రహం
- వాస్తవాలు తెలుసుకుని రాయాలంటూ హితవు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : టీడీపీ పాపం.. తమపై రుద్దవద్దని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా బుధవారం నగరి నియోజకవర్గంలో అభివృద్ధి చతికిలబడిందంటూ పచ్చపత్రికలో వచ్చిన కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నింద్ర మండలం కొప్పేడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పచ్చపత్రికలు చేసిన అసత్యప్రచారాన్ని ఎండగట్టారు. నిజానిజాలు తెలుసుకుని రాయాలంటూ వాస్తవాలను వెల్లడించారు. నేత కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని జగనన్న ఎన్నికల హామీ ఇవ్వలేదన్నారు. అన్ని విధాలా ఆదుకుంటాం అని మాత్రమే చెప్పామని, ఆ మాట మేరకు నేతన్న నేస్తంతో పాటు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పవర్‌లూమ్ విద్యుత్‌ను కేటగిరీ 4 నుంచి 3కు మార్చేస్తే అది నేడు అమలులోకి వచ్చిందని, ఆ కారణంగా విద్యుత్ బిల్లు పెరిగిందన్నారు. అందుకే వారికి వచ్చే అదనపు చార్జీలు తగ్గిస్తున్నట్లు నగరి సభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, దానిని అమలు చేయడానికి ప్రక్రియ నడుస్తోందన్నారు.

కమీషన్లకు కక్కుర్తి పడ్డారు!

పుత్తూరులో నీరు నిల్వ చేరే ప్రాంతంలో సమ్మర్ స్టోరేజ్ నిర్మించకుండా, టీడీపీ నాయకులు స్వలాభం, కమీషన్ల కోసం కక్కుర్తి పడి, నీరు చేరని ప్రాంతంలో నాసిరకంగా కట్టేశారని అన్నారు. అది దాహం తీర్చడానికి పనికిరాలేదన్నారు. ప్రస్తుతం బోరు వేసి సమ్మర స్టోరేజికి నీటిని పంప్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తెలుగు గంగ నుంచి పైప్ లైన్ మంజూరు చేసినట్లు ప్రకటించినా భూ సేకరణ, నీటి కేటాయింపు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019, జూన్ 15వ తేదీన పైప్‌లైన్ ప్రాజెక్టు ఏఐఐబీ ద్వారా రూ.139 కోట్లు మంజూ చేస్తే శాశ్వత మంచినీటి సరఫరాకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు.

స్థల రికార్డుల్లేవు

గొల్లపల్లి పీహెచ్‌సీకి స్థలం మంజూరు చేసినట్లు టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య ప్రకటించి, 2018, సెప్టెంబరు 28న శిలాఫలకం వేశారని, తన సొంత భూమిలా గంజి మాధవయ్య ఆయన తండ్రిపేరు అందులో వేసుకున్నారని అయితే దానికి సంబంధిత స్థల రికార్డులు ఏమీ లేవన్నారు. శ్రీభావనా రుషేశ్వర స్వాముల దేవస్థానం వారేమో అది తమ స్థలం అంటున్నారని, 1బిలో శ్రీభువనేశ్వరి వారి దేవాలయం అని ఉందని ఇంత గందరగోళం ఉన్నందునే నిర్మాణం ఆగిందన్నారు. మున్సిపల్ కార్యాలయం మంజూరు చేశామని చెప్పుకునే టీడీపీ వారు ఎందుకు అప్పుడు కట్టలేదన్నారు. వారు మాటలకు పరిమితం చేస్తే తాము మున్సిపల్ కార్యాలయ నిర్మాణం చేపట్టి చేతల్లో చూపిస్తున్నామన్నారు.

గత ప్రభుత్వ హయాం నుంచే బకాయిలు

నింద్ర నేటమ్స్ షుగర్స్ ప్రైవేటు చెరుకు ఫ్యాక్టరీ అని, రైతులకు గత ప్రభుత్వ హయాం నుంచి బకాయిలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ వారు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఫైనాన్షియర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో దానిపై కార్మికులు కోర్టుకు వెళ్లారన్నారు. దీంతోనే జాప్యం అవుతోందన్నారు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న చెరుకు ఫ్యాక్టరీలకు సంబంధించి రైతులకు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇప్పించామన్నారు. నగరి మండలంలోని వీకేఆర్‌పురంలో ఇండస్ట్రియల్ పార్కు 2018, ఏప్రిల్ 27వ తేదీన మంజూరు చేసినట్లు కాగితాల్లో పెట్టి బోర్డును మాత్రమే గత పాలకులు ఏర్పాటు చేశారని, భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపు జరగలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాకే 2021, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి భూ సేకరణ, రూ.6.64 కోట్ల నష్టపరిహారం చెల్లింపు జరిగిందన్నారు. 2023, జూన్ 1వ తేదీన భూములను నగరి తహసీల్దార్ ఏపీఐఐసీకి అప్పగించారని చెప్పారు. ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతున్నందున ఆ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఇండస్ట్రియల్ పార్కు పనులు ప్రారంభం అవుతుందన్నారు.

ఓటు నాటక ఫలితమే కాలుష్య శాపం

గత ప్రభుత్వాలు ఓటు కోసం ఆడిన నాటకమే కాలుష్య శాపమన్నారు. పచ్చపత్రికల్లో కాలుష్య నీరున్నట్లు చూపిన గుంటలు పదిహేనేళ్ల క్రితం నుంచి అలాగే ఉన్నాయన్నారు. వాటితో తనకు సంబంధం లేదని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్లాంటును నిర్వహణలోకి తెచ్చానన్నారు. టీడీపీ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ చెర్లోపల్లె రోడ్డు ప్రారంభించారని, దాన్ని పూర్తి చేయకుండా వదలిపెట్టాడన్నారు. జనరల్ ఫండ్‌లో రోడ్డును వేయడానికి ప్రయత్నించినా కోర్టును ఆశ్రయించి అడ్డుపడుతున్నారన్నారు. అందుకే రోడ్డు నిర్మాణం జరగలేదన్నారు. గతంలో గ్రామాలను మున్సిపాలిటీగా మార్చి పన్నులు మాత్రం వసూలు చేసుకున్న పాలకులు సౌకర్యాలను మాత్రం గ్రామస్థాయి కన్నా తక్కువగా వదలిపెడితే నేడు అన్నిరకాల అభివృద్ధి పనులు తాను చేశానని తెలిపారు. ఇసుక దోచుకున్నారు కనుకే టీడీపీని రెండు సార్లు తరిమికొట్టారన్నారు. కుశస్థి నదిని కుశస్థలి వనంగా మార్చేసింది వారే అన్నారు. నేడు రికార్డు పరంగానే ఇసుక తరలింపు జరుగుతోందని వాటితో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇందులో ఎవరికైనా సందేహాలుంటే ఏడీ మైన్స్ ఆఫీసుకు వెళ్లి తెలిపి, ఆపేయవచ్చన్నారు. తాము చేసిన ప్రతి పని రికార్డు రూపంగా చెప్పగలమన్నారు.

ఎస్వీ మెడికల్ కళాశాలకు ప్లాస్టిక్ సర్జరీ పీజీ సీట్లు

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆసుపత్రికి తొలిసారిగా 92 ప్లాస్టిక్, రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ, సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఎస్వీ మెడికల్ కళాశాల చరిత్రలో ఇప్పటి వరకు ఈ విభాగంలో పీజీ సీట్లు మంజూరు కాలేదు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా రుయాను అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పించడంతో మెడికల్ కౌన్సిల్ ఎస్వీ మెడికల్ కళాశాలకు పీజీ సీట్లు, గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఈ క్రమంలో పీజీ సీట్లను భర్తీ చేశారు. ఈ క్రమంలో పీజీ సీట్లు పొందిన ఏపీకి చెందిన డాక్టర్ ప్రణయ్, కేరళకు చెందిన డాక్టర్ కేపీ.యహ్యాకు బుధవారం ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఎస్వీ మెడికల్ కళాశాలకు నూతన వైభవం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మెడికల్ కళాశాల స్థాయి పెరిగిందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో వైద్యుల నియామకాలు చేపట్టడంతో వైద్య విద్య పరిపుష్టిగా ఉందన్నారు. పేద రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంక్షేమం..అభివృద్ధికి కేరాఫ్ ఏపీ

- జగన్ననే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- వై ఏపీ నీడ్స్ జగన్‌లో మంత్రి రోజా


కొప్పేడులో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా

నింద్ర: సంక్షేమానికి అభివృద్ధికి కేరాఫ్ ఏపీ అని, అందుకు కారణం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం నింద్ర మండలంలోని కొప్పేడులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలోని నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూపే బోర్డులను ఆమె ఆవిష్కరించారు. మంత్రి ఆర్కే రోజా ముందుగా కొళ్లాపురి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలు ప్రజలకు అందించిన ఘనత జగన్నకే దక్కుతుందని అన్నారు. అవ్వాతాతలకు, విద్యార్థులకు పలు పథకాలు అమలు చేసి, వారికి ఆదుకున్న నాయకుడు జగనన్న అని చెప్పారు. ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ప్రభుత్వం మన జగన్నన ప్రభుత్వమే అని అన్నారు.

అవ్వా నీకు పింఛన్ వచ్చిందా?

గడప గడప కార్యక్రమంలో మంత్రి రోజా వృద్ధులతో మాట్లాడుతూ అవ్వా నీకు పింఛన్ అందుతుందా? అని అడగ్గా.. ప్రతి నెల ఒకటో తేదీనే ఇస్తున్నారమ్మా అని సమాధానం ఇచ్చారు. మీకు అండగా ఉన్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో పేదలు, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కొప్పేడు సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వివరాలను డిస్‌ప్లే బోర్డుల దారా తెలియజేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో ఇలాంటి పనులు ఏమైనా జరిగాయా? అన్న విషయంపై ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించిన జగన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో మంత్రి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, వైస్ ఎంపీపీ శుభ, మండల కోఆప్షన్ సభ్యుడు అనీల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చెంచమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి మేరి, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, నాయకులు వెంకటేష్, రమేష్, రాము, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలో సంచలనం రేపిన కీర్తన గోల్డ్ ఫైనాన్స్ కంపెనీకి చెందిన బంగారు ఆభరణాల చోరీ కేసు ఘటనలో జి.హరీష్ (24), జమున (50) అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.17 లక్షల విలువ చేసే 440 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన జాన్‌బాబు అనే వ్యక్తి కీర్తన గోల్డ్ లోన్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అసోసియేట్ వైస్ చైర్మన్‌గా, రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3వ తేదీ చిత్తూరులోని కీర్తన గోల్డ్ కార్యాలయంలో వినియోగదారులు విడిపించుకోవాల్సిన బంగారు ఆభరణాలను ప్రధాన కార్యాలయం నుంచి తెచ్చి డెలివరీ ఇచ్చాడు. బి.కొత్తకోట, కలికిరి, పీలేరులోని కార్యాలయాల్లో ఇవ్వాల్సిన 38 ప్యాకెట్లలో ఉన్న బంగారు ఆభరణాలను, ల్యాప్‌టాప్‌ను శుక్రవారం ఉదయం తన కారులో ఉంచి లాడ్జిలో గదిని ఖాళీ చేయడానికి వెళ్లాడు. అంతలో ఫోన్‌కాల్ రావడంతో గంటకు పైగా లాడ్జిలోనే ఉండిపోయి, ఆ తరువాత కిందకు వచ్చాడు. కారు తాళాలు తీసి చూడగా.. వెనుకవైపు ఉన్న అద్దాలు పగులగొట్టి 38 ప్యాకెట్లలో ఉన్న దాదాపు రూ.22 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన నటరాజన్, హరీష్, జమున తదితరులు చిత్తూరు నగరంలో తిరుగుతూ కారులో ఉన్న బ్యాగును చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుల్లో నటరాజన్ తప్పించుకుని తిరుగుతుండగా.. కట్టమంచి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న హరీష్, జమునను అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుచినాపల్లికు చెందిన నిందితులు ఇద్దరూ కూడా పశ్చిమ బెంగాల్‌లో స్థిరపడినట్టు గుర్తించి, వీరి వద్ద ఉన్న 440 గ్రాముల బంగారు ఆభరణాలను సీజ్ చేశారు. ప్రధాన నిందితుడు నటరాజన్‌ను అరెస్టు చేయాల్సి ఉందని, ఇతడి నుంచి మరిన్ని బంగారు ఆభరణాలను రాబట్టాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కాగా కేసు ఛేదించడంలో ప్రతిభ చూపించిన వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జున తదితరులకు డీఎస్పీ శ్రీనివాస మూర్తితో కలిసి ఎస్పీ నగదు రివార్డులు అందజేశారు. ఈ మీడియా సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, శిక్షణ డీఎస్పీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల మెదటి అంతస్తు నిర్మాణానికి ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. రూ.2.5 కోట్లతో నిర్మించనున్న పైఅంతస్తు కారణంగా ఫార్మసీ విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. దీంతో విద్యార్థులు చదువుకోవడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, తద్వారా వారు చదువుపై ఏకాగ్రత చూపవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య అప్పారావు, బిల్డింగ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, యూనివర్సిటీ ఇంజినీర్ తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడి..అభివృద్ధి ఒరవడి

జనవాక్కు

ప్రభుత్వం విద్యాశాఖలో విప్లవాత్మక మార్పుల తీసుకువచ్చింది. నాడు–నేడుతో పాఠశాలల్లో సకల వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. ఫలితంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్నాయి. మరోవైపు సీబీఎస్‌ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశ పెట్టారు. సరికొత్త మెనూ అమలు చేస్తూ ప్రభుత్వం విద్యార్థులనూ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సిఫార్సులు చేసే స్థాయికి చేరుకున్నాయి. దీంతో పిల్లలు ఎంచెక్కా చదువులమ్మ ఒడిలో పాఠాలు నేర్చుకుంటున్నారు.

– చిత్తూరు కలెక్టరేట్


నాడు–నేడు పాఠశాలల్లో సౌకర్యాలు

నాడు–నేడు జీవం పోసింది



మా కోదండ రామాపురం ప్రాథమిక పాఠశాలకు నాడు–నేడు పథకం జీవం పోసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పథకంతో పాఠశాలకు రూ.55 లక్షలు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో గతంలో ఎన్నడూ లేని అత్యధిక వసతులు సమకూరాయి. కార్పొరేట్ బడులకు వాటుగా మా పాఠశాల ఆకట్టుకుంటోంది. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూరాయి. అడ్మిషన్లు సైతం గతంకంటే పెరిగాయి.

– పొన్నురంగం, టీచర్, కోదండరామాపురం, కార్వేటినగరం.

మా ఇద్దరు పిల్లలు ప్రభుత్వబడిలో చదువుతున్నారు



నా ఇద్దరు పిల్లల్ని పెనుమూరు జెడ్పీ హైస్కూల్‌లో చదివిస్తున్నాను. ఈ ప్రభుత్వం వచ్చాక గతంలో ఎప్పుడూ చూడనంత మార్పు చూశాం. నేను చదువుకునే రోజుల్లో మా బడిలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు అన్ని మెరుగైన సౌకర్యాలు నాడు–నేడు పథకం ద్వారా కల్పించారు. పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం బాగుంది. విద్యకు ప్రాధాన్యతనిచ్చి సర్కారు బడుల్లో ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– పద్మావతి, విద్యార్థి తల్లి, తాటిమోగులపల్లె, పెనుమూరు మండలం

సీఎంకు రుణపడి ఉంటాం



సర్కారు బడుల్లో ఠంఛనుగా పాఠ్య పుస్తకాలు, జగనన్న కానుకలో ఏడు రకాల విద్యా సామగ్రి, ఏటా అమ్మఒడి, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పొద్దున రాగిజావ తదితర సౌకర్యాలను ప్రభుత్వం సర్కారు బడుల్లో కల్పించింది. ఫలితాలు ప్రైవేట్ కంటే దీటుగా వస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పథకంతో పలమనేరు హైస్కూల్ సుందరంగా తయారైంది. ఇన్ని సౌకర్యాలున్న సర్కారు బడిని కాదని ప్రైవేట్ బడికి పిల్లలను ఎందుకు పంపుతాను..అందుకే మా పిల్లలను సర్కారు బడిలోనే చదివిస్తున్నాను. పిల్లలచదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న సీఎంకు రుణపడి ఉంటాం.

– భారతి, విద్యార్థి తల్లి, పలమనేరు

పాఠశాలలకు ఆధునిక వసతులు



పాఠశాలలకు ఆధునిక వసతులు సమకూరాయి. శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు సమకూరాయి. ఈ వసతులన్నీ ఈ ప్రభుత్వం వల్లే సాధ్యమయ్యాయి. నాడు–నేడు పథకంలో రూ.1.30 కోట్లతో పాఠశాలను అభివృద్ధి చేశారు. ఆరు గదులు, వంటగది, మరుగుదొడ్లు, ప్రహరీగోడ, తదితర సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులకు నాణ్యమైన డెస్కులు, తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యాల వల్ల ప్రైవేట్ బడుల నుంచి శ్రీహరిపురం పాఠశాలలో నూతన అడ్మిషన్లు పెరిగాయి.

– చంద్రగిరి సోమశేఖర్, హెచ్‌ఎం, శ్రీహరిపురం, విజయపురం మండలం.

పాఠశాల చూడచక్కగా ఉంది



నా ఇద్దరు పిల్లలు విజయపురం దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. పేద కుటుంబానికి చెందిన వారం కావడంతో కాన్వెంట్ స్కూల్‌కు పంపలేని పరిస్థితి. అయితే ఇప్పుడు మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల కార్పొరేట్ కంటే మిన్నగా మారింది. మా పిల్లలు మేథ్యూ, జయశ్రీ చూడచక్కని పాఠశాలలో నేడు చదువుతున్నారు. పాఠశాలలో నేడు అన్ని వసతులు ఉన్నాయి. మా పిల్లలు మంచి పాఠశాలలో చదువుతున్నారన్న ఆనందం ఇప్పుడు మా సొంతం అయ్యింది. మా పిల్లల బాగు కోసం ఇంతలా ఆలోచించిన సీఎంను మేము ఇప్పటి వరకు చూడనేలేదు.

– సుకన్య, విజయపురం దళితవాడ.

స్టాకు సరిచూసుకోండి


తనిఖీ నిర్వహిస్తున్న డిపో సబ్ ఇన్‌స్పెక్టర్

నగరి : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు ప్రతిరోజూ అమ్మకాల అనంతరం మద్యం స్టాకును సరిచూసు కోవాలని చిత్తూరు మద్యం డిపో సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి సూచించారు. చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు, డిపో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు బుధవారం నగరి పట్టణంలోని వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, బీరు సీసాలను ప్రతిరోజు సూపర్‌వైజర్లు సరి చూసుకుంటుంటే స్టాకుల్లో ఎలాంటి తేడాలు ఉండవన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, తాము నిర్వహిస్తున్న డెకాయ్ ఆపరేషన్‌లో ఎవరైనా అధిక ధరలకు అమ్మినట్లు కనుగొంటే సంబంధికులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో వెరిఫికేషన్ ఆఫీసర్ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఆగని గజదాడులు


ఏనుగులు ధ్వంసం చేసిన ఫెన్సింగ్ కూసాలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. మంగళవారం ఇందిరానగర్‌లో ఇళ్ల మధ్యన ఉన్న పాఠశాల ప్రహరీగోడను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి పక్కనే ఉన్న రమణారెడ్డి మామిడి తోటలో చెట్లతోపాటు చుట్టూ ఉన్న ఫెన్సింగ్ కూసాలను ధ్వంసం చేశాయి. దీనితో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని జనం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయపడుతున్నారు. పొలాలు వదిలి ఇళ్ల మధ్యకు వస్తుండడంతో భయభ్రాంతులు చెందుతున్నారు.

ఆయా కర్కశత్వం


గాయపడిన రియాన్

వి.కోట: అంగన్‌వాడీలో పనిచేసే ఓ ఆయా ఓ చిన్న పిల్లాడిపై కర్కశత్వంగా ప్రవర్తించింది. ఈ ఘటన చూసిన వారి మనస్సులను కలచివేసింది. బాధితుడి తల్లిదండ్రుల కథనం మేరకు.. మండలంలోని కష్టాపురం అంగన్‌వాడీ కేంద్రంలో రఫీక్ కుమారుడు రియాన్(4) అనే చిన్నారి చదువుకుంటున్నాడు. యథావిధిగా బుధవారం కేంద్రానికి వచ్చాడు. పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఆయాను కోడిగుడ్డు ఇవ్వాలని అడిగాడు. దీంతో ఆగ్రహించిన ఆయా గాయత్రి చిన్నారిపై వేడి నీళ్లు పోసింది. దీంతో రియాన్‌కు ఛాతిపై గాయం అయ్యింది. విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు రియాన్‌ను వి.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రభుత్వం చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వారికి ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. అయితే చిన్నారి ఇంటి వద్ద నుంచే గాయంతో బడికి వచ్చాడని, తామేమి పిల్లాడిపై వేడినీళ్లు పోయలేదని ఆయా తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేసింది. విషయం తెలుసుకున్న సీడీపీఓ, ఉన్నతాధికారులు గ్రామానికి చేరుకుని, తల్లిదండ్రులతో చర్చలు జరిపి జరిగిన విషయం గురించి ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ నిర్వాహకురాలు, సిబ్బందికి మెమో జారీ చేశామని, వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వినాయకునికి గోవుల బహూకరణ


గోవులను విరాళంగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డికి అందజేస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి రెండు గోవులను అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రానాయుడు, గల్లా అరుణకుమారి కుటుంబం బుధవారం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డికి అందజేశారు. మధ్యాహ్నం గల్లా కుటుంబం బహూకరించిన రెండు గోవులను వారి వ్యక్తిగత సభ్యులు బాలకృష్ణారెడ్డి ఆలయ చైర్మన్‌కు అందజేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేఖర్ గురుకుల్ గోవులకు పూజలు చేసి గోశాలకు తీసుకెళ్లారు. దాతలకు ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.